నాటిక

# పరిణీత

వి.వి.యస్. అచ్యుతవల్లి



## ఇందు వచ్చు పాత్రలు :

జోగప్ప : సంగీత విద్వాంసుడు. (పాఠాలుకూడా చెబుతూ వుంటాడు)

పశుపతి ; బి. ఎ. చదివే విద్యార్థి. ఇంటి యజమాని అవధాని కొడుకు.

సుఖాన్ : నాటకాలరాయుడు. సినీ హీరో అవ్వాలని కలలు కంటూ వుంటాడు.

రాజారాం : అవధాని ఇంట్లో ఒక వెంపు వాటాలో వుంటూ వుంటాడు. ఏదో కంపెనీలో ఉద్యోగి.

రాజ్యలక్ష్మి : పాతికేళ్ళలోపు అందమయిన తెలివయిన యువతి. బి. ఎ. ప్యాసయింది. సంగీతం కూడా బాగా పాడుతుంది. కొన్నాళ్లు జోగప్ప దగ్గర వీణ నేర్చుకుంది.

మాణిక్యాంబ : నడివయస్సు వితంతువు. రాజ్యలక్ష్మి తల్లి. ఏదో అమాయకత, ఆందోళన కనపడతాయిముఖంలో.

నాటిక అంతా రెండే రెండు సెట్టింగ్స్‌లో జరుగుతుంది. ఒకటి రాజ్యలక్ష్మి వాటా, అందమయిన సోఫాసెట్టు, రేడియో, టేబుల్‌మీద వీణ, మొదలయిన హంగులతో వుంటుంది. వీలున్న టేప్‌రికార్డర్, రికార్డ్‌ప్లేయర్ మొదలయిన సంగీతసాధనాలు కూడా అమర్చవచ్చును. రెండో సెట్టు అవధాని ఇల్లు. అంటే పశుపతి గది. రెండు మూడు పుస్తకాల రాక్స్, ఒక మడతమంచం, రెండు కొయ్యకుర్చీలు, ఒక కొయ్య టేబులూ వుంటాయి. మడతమంచం మీద ఒకదుప్పటి పరిచి వుంటుంది. రెండు తలగడాలు కూడా వుంటాయి, టేబులుమీద అద్దం, దువ్వెన బ్రిల్ క్రీమ్, స్నో, పౌడర్, పెన్ను, సిరాబుడ్డి, చిందరవందరగా కొన్ని పుస్తకాలు వుంటాయి.

పశుపతి, రాజారాం, జోగప్ప, సుఖాన్ ఇంచుమించు ముప్ఫయ్ సంవత్సరాల లోపు యువకులు. అందాల బొమ్మ అయిన రాజ్యలక్ష్మి అంటే వీళ్ళు నలుగురూ అభిమానంగా వుంటారు. పైగా రాజ్యలక్ష్మికి నగరంలో లక్షరూపాయలు విలువచేసే మేడ ఒకటి వుంది. ఆ మేడ అమ్మి సొమ్ము చేసుకుందామనే మాణిక్యాంబ కూడా వచ్చి కూతురు దగ్గర మకాంపెట్టింది. రాజ్యలక్ష్మి ఇన్నాళ్ళూ హాస్టల్‌లో వుండేది. తల్లివచ్చేక అవధాని ఇంట్లో ఒకవాటా అద్దెకు తీసుకుని వంట మొదలుపెట్టింది. తల్లీ కూతుళ్లు ఆ మేడ అమ్మకం కోసం అదుర్దాపడుతూ వుంటారు.)

### 1వ రంగం


(తెరలేచేసరికి. పశుపతిగది. పశుపతి ప్రేక్షకుల (1) వెంపు వీపు పెట్టి తెరలోంచి బయటికి దేన్నో దీక్షగాచూస్తూ సించుంటాడు. అవధాని. ప్రవేశిస్తాడు. తెరకి ఒక కిటికీలా, చిన్నకన్నం వుంటే బాగుంటుంది.)

అవ-: ఏవిట్రా ఆకిటికీ దగ్గర అఘోరిస్తున్నావ్!

పశు: -(ఉలిక్కిపడి) మీరా నాన్నగారూ!

అవ:_అ.నేనే. ఏమిటంత దీక్షగాచూస్తున్నావ్?

పశు:-(తన్మయత్వంగా కళ్ళుమూసుకుని) చూస్తున్నాను. ఒక సుందర శిల్పాన్ని కన్నుల పండువగా చూస్తున్నాను. ఆ.హా హా! ఏమా దివ్యముఖారవిందము? వికశించిన వేయిరేకుల తామరపద్మము? గండు మీనములవంటి ఆ ముగ్ధసోగకన్నుల విస్మిత దృష్టి ఎవరిపై




బరువునో వారలు అమందానందకందళిత హృదయులై ఆనంద సాగరతరంగాలలో ఊయలలూగ కుందురా?

అవ:—(గాభరాగా కొడుకును ముట్టుకునిచూసి) ఏమిటిరా ఈవాగుడు! ఉష్ణం వచ్చిందేమో అనుకుంటే వళ్లు చల్లగానే వుందే ఏదయినా తొక్కావా?

పశు:—(తండ్రి) చేయిదూరంగా త్రోసి ఏమిటి మీగోలనాన్నగారూ! అగ్నిశిఖలాంటి నాభావజ్వాలని మీవెధవ మాటలతో చప్పగా చల్లారేస్తున్నారు. తెలుగులో డిట్టింక్షన్ తెచ్చుకున్నవాణ్ని! నాకు కవిత్వం రాదంటారా! ప్చ్! నాఖర్మ! మంచి ఫ్లోవచ్చిదనుకున్నాను. నాస్పందిచే హృదయాన్ని మీఉక్కు పిడికిలితో నలిపేసారు.

అవ:-(జనాంతికంగా) వీడికి పైత్యం బాగా ప్రకోపించింది, కాస్త అల్లంరసం, తేనెకలిపి పట్టుకొస్తాను. ఏంచేయను? ఆడదిక్కు లేదాయె తల్లయినా తండ్రయినా నేనేకదా: (లోపలికి వెళతాడు.)

పశుపతి మళ్ళీ తెరదగ్గరకి వెళ్ళి కిటికీ అనబడే తెరకన్నంలోంచి చూస్తూవుంటాడు. ఇంకొక వెంపు నించి రాజారాం వస్తాడు. పశుపతి వెనకా తల పిల్లిలా వెళ్ళి తనూ పశుపతి వీపు మీంచి తెరకన్నంలోనికి చూస్తాడు. తిరిగి ప్రేక్షకుల వెంపుచూసి కనుబొమ్మలు ఎగరవేస్తాడు.)

రాజా:—ఏమిటి మాష్టారూ. అంత దీక్షగా చూస్తున్నారు?

పశు:—(తడబాటుతో) అవునండీ! ఈకిటికీ అంతా చెదపట్టిపోయింది, ఇదంతా దులిపి కాస్త కిర్సనాయిల్ పోయాలి. మీరేమిటి పొద్దున్నే ఇల్లా వచ్చేరు?

రాజా:-మా బాత్రూంలో పంపులో నీళ్ళు రావటం లేదు. రాత్రి పదింటికి కాబోలు శరెంటు ఫెయిలయింది, ఇంతవరకూ తిరిగి రాలేదు.

అవ:—(చిన్నగాజుగ్లాసులో అల్లంరసం కలిపి తెచ్చి) ఇదిగో పశూ ఇది కొంతా పుచ్చేసుకో నాయినా! (అటూ ఇస్తాడు.)

పశు:-(తాగేసి ముఖం వికారంగా పెట్టి) అబ్బ. ఏమిటి నాన్నా ఇది?

అవ:—ఒక్కపిసరు అల్లంరసంతీసి తేనెకలిపి ఇచ్చాను.

పశు:—(ఆశ్చర్యంగా) నాకెందుకూ?

అవ:—(కళ్లుపైమీదిగా పంచతో అద్దుకుంటూ) పొద్దున్న అదోలా మాట్లాడేవు కదరా. నాకు భయం వేసింది. అస్తమానూ వెధవ సిగరెట్లు కాలుస్తావు. పైత్యం ముఖాన్న పడ్డావేమో, అని అల్లరసం తీసి ఇచ్చాను. ఏం చేయనూ ఆడదిక్కు లేదాయె!

రాజా:— భలేవారండీ! మీఅబ్బాయికిప్పుడు ఎన్నేళ్లుంటాయి?

ఆవ:-(కళ్ళుమూసుకుని నోటితో ఏదో లెఖ్కపెడుతూ) వూఁ, పోయిన జ్యేష్ఠ బహుళదశమి నాటికి ఇరవయి నాలుగూ దాటి వుండాలి.

పశు:-ఆవయసులో మీరేం చేసే వారునాన్నగారూ?

అవ:-(నవ్వి) ఏం చేసేవాడిని? జంధ్యాలు వడుక్కునే వాడ్ని.

రాజా:-ఇంకేం చేసే వారు?

అవ:-కామందుల ఇళ్ళల్లో పురాణ పఠనం చేసేవాడ్ని.

రాజా:-అప్పటికి మీకు ఇంకా పెళ్ళికాలేదా?

పశు:-(సంతోషంతో రాజా రా? భుజం తట్టి) అడగవలసిన ప్రశ్న అడిగారు,

అవ:—స్మార్తంతో దేవుల్లాడేవాళ్ళం. మాకు పెళ్ళిళ్లు అవటం కష్టంగానే వుండేది. ముప్పయి నాలుగోఏట కాబోలు. సోమిదేవితో పెళ్ళయింది. నాలుగేళ్ళకి కాపరానికి వచ్చే పిల్లల్ని సంబరపడ్డాను. ముఖమన్నా తిన్నగా చూడకుండానే దానికీ నాకూ ఋణం తీరిపోయింది. (పైగావంచతో కళ్లు తుడుచుకుంటాడు.)

రాజా:—తర్వాతేం చేసారు?

అవ: ఆ విచారంతో నేను మళ్ళీ పెళ్ళిమాటే తలపెట్టలేదు. కాని వీడి తాతగారు నన్ను మరీ బలవంతం చేసారు. దానితో తప్పని సరియై వీడి అమ్మని చేసుకున్నాను. అప్పటికింకా రజస్వలానంతర వివాహాలు అందరూ ఒప్పేవారు కాదు. వీడి అమ్మకి పాపం, సంబంధాలు చూస్తుండగానే పదిహేనేళ్ళు వొచ్చేసాయి, వీడి తాతగారు సద్బ్రాహ్మణులు. అహితాగ్నులు. ఆయిన బెంగచూడలేక నేను అనసూయని పెళ్ళి చేసేసుకున్నాను.

రాజా:-(ఆశ్చర్యంగా) మీరు గృహస్థ జీవితం ఎన్ని ఏళ్ళవయిస్సులో ప్రారంభించారు?

అవ:-అఁ! ఎంతోనా! నిండా నలభయిఏళ్లు రాలేదు. నలభయ్ నాలుగోఏట కాబోలు మా పశుపతి పుట్టాడు, నిజంగా మాఅనసూయ మహాఇల్లాలు. నేను ఏం తెచ్చేవాడినో. అవిశ ఏం చేసేదో! రెండోకంటివాడికి తెలిసేదికాదు. వున్నదేదో ఊర్జితం చేసి ఈఇల్లు నిలబెట్టింది, తలకొరివి పెట్టటానికి కొడుకు నిచ్చింది. మహాఇల్లాలు నాయనా. అది! (పైగావంచతో చెమ్మగిలిన కళ్ళని అద్దుకుంటాడు.)

రాజా:-అరోజుల్లో అందరాడోళ్ళూ మహాఇల్లాళ్ళుగానే వుంటూ వుండేవారు లెండి. ఇంతకీ మీఅబ్బాయికి పెళ్ళి ప్రయత్నాలు చేయండి పైత్య వికారాలువస్తే, ఆతని భార్యే చూసుకుంటుంది,

అవ:-(నిటారుగా నిలబడి పిలక ముడి విప్పి జాడించి మళ్ళీ వేసుకుంటూ)

మావాడి కేమయ్యోయ్! ఈ ఇల్లూస్థలమూ,

ఎటూ లేదన్నా పాతిక ముప్పయ్ వేలు ఖరీదు చేస్తాయ్. బి.ఎ. చదూతున్నాడు. ఒక్కగా నొక్కడు. పదివేలు కట్నం యిస్తే కాళ్లు పిల్లని గుమ్మం ఎక్కనీయను.

రాజా:-మీఅబ్బాయి అభిప్రాయం కనుక్కోరా?

అవ:-వాడికేం తెల్సు! పిల్లవెధవగాడు.

పశు:-అదేమిటి ఇప్పుడేగా నేను బి.ఏ. చదూతున్నవాడి నన్నారు?

అవ:-చదవటం లేదామరి!

రాజా:-అవధానిగారూ! ఈరోజుల్లో చదువుకున్న యువకులు స్వయంవరాలకి వెళ్లుతారండీ! మీరు కట్నాలూ కానుకలూ అంటూ తాడు బిగించెయ్యక కాస్త మీఅబ్బాయిని గాలికి వదిలేసి చూడండి. ఆగాలి ఎటు మళ్లుతుందో.

(ప్రక్కవాటాలోంచి రాజారాంగారు! అంటూ సన్నటి పిలుపు వినపడుతుంది.)

రాజా:-ఆఁ!ఆఁ. వస్తున్నాను. వస్తానండీ పశుపతి గారూ.(అంటూ వెళ్ళిపోతాడు)

అవ:-ఆదేమిటిరా! ఆ ఆడకుయ్యి వినపడగానే అల్లా వెళ్తున్నాడు. ఇతను?

పశు:-ఆ అమ్మాయి ఇతనేదో పెద్ద వుద్యోగస్తుడనుకుంటోంది. తల్లీకూతుళ్లు అతనంటే ఎంతో అభిమానం చూపుతున్నారు. ఇరవయి నాలుగ్గంటలూ అతనో చే బాతాఖానీ వేస్తున్నారు.

అవ:-ఆవిడయితే ఫరవాలేదు. ఈపిల్లకేం తెగులూ, పెళ్ళీ పెటాకులూ లేకుండా మగాళ్ళతో గంటలకి గంటలు డబ్బీలు కొట్టూ కూర్చుంటే ఏం బాగుంటుందీ.

పశు:-ఆవిడ బి.ఎ. ప్యాసు అయిందినాన్న. క్లాసులో ప్యాసు అయిందిట.

అవ:-అవునవును. చదువుకున్నవాళ్ళకి ఎగ్గేమిటి? వద! గుప్పెడు మెతుకులుతిని స్కూలుకి పోదువుగాని.

(ఇద్దరూ లోపలికి వెళ్లడూంటే తెర(వాలుతోంది.)

## 2వ రంగం

(తిరిగి తెర లేచేసరికి రాజారాం రాజ్యలక్ష్మి వాటాలో ఒక సోఫాలో కూర్చుంటాడు. ఎదురుగా వున్న సోఫాలో రాజ్యలక్ష్మి కూర్చునుంటుంది.)

రాజా:-ఏమిటండీ! అంత అర్జంటుగా పిలిచారు?

రాజ్యం:-నేను మీకన్నా చాలా చిన్నదాన్ని. నన్ను అండీ అంటారేమిటండీ!

మణి:-(టీకప్పుతెచ్చి రాజారాంకిస్తూ) ఒక ఇంటిలో వుంటున్నాం. తోబుట్టువుల్లా వుండాలి నాయినా! ఇంతకీ మనదేవూరు?

రాజా:-(టీచప్పరిస్తూ)మాది అసలీవూరే! నే పుట్టిందీ పెరిగిందీ ఉద్యోగస్థు డయినదీ ఇక్కడే.

రాజ్యం:-ఏ రే కంపెనీలోనండీ ఉద్యోగం చేస్తున్నారు?

రాజా:-ఎక్స్‌పోర్టు డివిజన్ లెండి. ఫెర్టిలై జర్స్‌లో చేస్తున్నాను.

రాజ్యం:-అల్లాగా. అన్నట్లు మాకు దూరం చుట్టం ఒకరున్నారు. పేరు సుభాష్ చంద్ర. మీ ఫెర్టిలై జర్స్‌లోనే చేస్తున్నానన్నాడు. వెయ్యరూపాయలు జీతంట మీకేమన్నా తెలుసా?

రాజా:-ఓహో. అతనా. సుభాన్ అని నాటకాల్లో కూడా వేషాలు వేస్తూవుంటాడు. అతనంత పెద్ద జీతగాడు కాదే?

రాజ్యం:-మీ ఫెర్టిలై జర్స్ కంపెనీలో స్వీపర్స్‌కి కూడా వెయ్యేసి రూపాయల జీతం వుంటుం దంటారు అంతా నిజంకాదా.

సంక్రాంతి శుభాకాంక్షలు! పండుగ సందర్భంగా ప్రత్యేక రిబేటు!

ది. 20-12-75 నుండి 20-1-76 వరకు 15% 5% రిబేటు ఇవ్వబడును.

స్త్రీల సౌందర్యాభివృద్ధికి నలయు అసలైన వెండి జరీతో తయారయిన కంచి పట్టు చీరలు, లంగాలు, చోళీలు

కంచి ధరలకే విజయవాడ బ్రాంచీలో లభించును.

ఆదివారములు, పండుగ రోజులలో కూడా షాపు తెరచియుండును.

# కంచి కామక్షమ్మ పట్టు చేనేత కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్

హెడ్డాఫీసు : కంచి, 168 ఎ, గాంధీ రోడ్డు,

బ్రాంచి : మశీదువీధి, ఏలూరురోడ్, (సోనోవిజన్ ప్రక్కవీధి) విజయవాడ-2

బ్రాంచి : 27, 2వ అగ్రహారం, సేలం-1

కె. ఎస్. పార్థసారథి, అధ్యక్షులు

టి. ఇ. జ్ఞానసుందరం, బి. ఎ., కార్యదర్శి.,

రాజా:-నాసుఖం, నాకే ఎనిమిది వందలలోపు వస్తుంటే,

రాజ్యం:-ఆయన కనపడితే ఒకసారి రమ్మ న్నానని చెబురూ. మాఅమ్మకి దూరపు చుట్టంట. అమ్మరాగానే ఫోన్ చెయ్యమన్నాడు, నంబర్ మర్చిపోయెను.

రాజా:-నాకు రోజు కలుస్తోనే వుంటాడు. చెబ్తాను. కాని ఆట్టే నమ్మదగిన వ్యక్తికాదు. నాటకాలరాయుడు,

మాణి:-మాపల్లెటూళ్లో అయితే ఒకరి వ్యవహా రాలు ఇంకొకరు ఎంతో శ్రద్ధాశక్తులతో చూస్తోవుంటారు. ఇక్కడ ఎవరెవరికి కావాలి? మహానగరం. ఏమాత్రం అమాయకంగా కన పడ్డా ప్రమాదమే. అందులో మగదక్షత లేని సంసారమాయె.

రాజా:-మీరేం దిగులుపడకండి. మీకేం సాయం కావాలన్న నేను చేస్తాను.

రాజ్యం:-ఇంత చదువుకునీకూడా అమ్మమ్మల కాలంలో లాబెదిరి పోవటమంటే నాకు గిట్ట దండీ. మన సమస్యలని మనమే పరిష్కరించు కోగలంటాను,

రాజా:-సరేలెండి. మీరు కాలేజీ ఎందుకు మానివేసారు. యం.ఎ. చదువుకోవచ్చుకదా. ఎందుకు అనవసరంగా ఖాళీగా రోజులు గడవటం?


రాజ్యం:-ఏముండండీ, మెయిన్ బజారులో తాతలనాటి మేడ ఒకటుంది. అది అమ్మకం పెడదామని మా అమ్మ వచ్చారు. రోజూ కొన టానికి వచ్చేవాళ్ళతోనూ పోయేవాళ్ళతోనూ ఆమె డబ్బా పెట్టటానికి వెళ్తూ వుండాలి. నాకూ ఇంక చదువులో ఆసక్తిలేదు. మానాన్న గారి సరదా కాదనలేక బి.ఏ.లో జేరాను. ప్యాసు అయ్యేను. ఇంక చదవటమంటె బద్ధకం వేస్తూంది.

జోగాప్ప:- ఏం చేస్తున్నారు! ఇవిగోనండి మీరుకోరిన త్యాగరాజుగారి నవగ్రహకీర్తనలు.

రాజ్యం:-(నవ్వి) కూర్చోండి మాష్టారూ! నవగ్రహకీర్తనలు త్యాగరాజుగారివి కావు. ముత్తుస్వామి దీక్షితుల వారివి.

జోగప్ప:-ఎవరివో ఒకరివి. నేను కన్‌ఫ్యూజ్ అయిపోతూంటాను, సాహిత్యం శ్రావ్యంగా పాడాలి కాని ఎవరు వ్రాసినవి అయితేనేం! వాళ్ల వ్రాసారనీ వీళ్లు వ్రాయలేదనీ తావులకి తావులు వ్యాసాలు వ్రాసి పి. హెచ్. డి. చెయ్యాల్సిన అవసరమేం లేదు నాకు. అన్నట్టు నీకు భైరవి రాగా లాపన బాగా వచ్చిందా?

రాజ్యం:-ఏమిటోనండి. ఈమధ్య వీణే ముట్టు కోవడం లేదు. అన్నట్లు సాయంకాలము ఉభయ[illegible]త్ హాలులో బాలమురళీకృష్ణగారి




కచ్చేరీ వుందిట. కాస్త సాయం వస్తారా.

జోగప్ప:-విత్ ప్లెజర్, నేను నాలుగ్గంటల కల్లా వచ్చేస్తాను.

రాజారాం -అన్నట్లు నాకు కూడా రెండు ఫ్రీ పాసులు వచ్చేయి. మీరు కావాలంటే ఇస్తాను.

మణి!-నువ్వూ అమ్మాయీ వెళ్ళండినాయనా. ఒకింట్లో వుంటున్నాం కనుక ఇద్దరూ కలిసే రావొచ్చును. పొద్దుపోయినా, నాకు బెంగ వుండదు ఇంక.

జోగ : మా స్నేహితుడికి కారు వుంది. అడిగితెస్తాను లెండి నేనుకావాలంటే కాద నడు వాడు.

రాజా :- అయితే నేనువెళ్తానండి. ఆఫీసు టైం అయిపోతోంది.

(రాజారాం వెళ్ళబోతోంటే పశుపతివస్తాడు)

పశు :- చూడండి! మిస్ రాజ్యంగారూ

రాజ్యం :- ఎవరండీ మీరు ?

మణి :- ఎవరాలూకు నాయినా ?

పశుపతి :- (నవ్వి) మీ తాలూకేఅత్తయ్యగారూ!

రాజ్యం :- అత్తయ్యగారా!

పశు :- కంగారుపడకండి కల్యాణిగారూ! నేనుండేది కూడా మీఇంట్లోనే!

రాజ్యం :- అంటే ?

రాజా :- ఈయన మన యింటి యజమాని ఏకైక పుత్రుడు! గ్రాడ్యుయేట్ కావాలని మూడేళ్ళబట్టీ ప్రయత్నం చేస్తున్నాడు. రాజ్యంగారూ మాట (దగ్గిరగావెళ్ళి) కొంచెం స్క్రూలూజ్! అంతే! (కణతల మీద చూపుడు వేలుతో కొట్టి చేతితో లేదన్నట్లు చూపెడుతాడు.) తర్వాత వెళ్ళిపోతాడు)

మాణి :- కూర్చో నాయనా! మీరు కూడా కూర్చోండి మాష్టారు గారూ! కాస్త 'టీ' కలిపి తీసుకువస్తాను. అమ్మాయితో మాట్లాడుతూ వుండండి (లోపలికి వెళ్తుంది.)

పశుపతి :- కాఫీ వద్దు పిన్నిగారూ! అన్నాను. ఏమీ అనుకోకండి.

రాజ్యం :- తప్పుమాట కాదులెండి.

పశు :- నేను మీ ఇంటివారి అబ్బాయిని. నన్ను గుర్తు పట్టలేదా? రోజూ చూస్తూనే వున్నారుగా!

రాజ్యం :- రోజూ చూసినా నాకంతగుర్తు వుండదు. ఇంతకిమేము రెండునెలల అడ్వాన్స్ ముందే ఇచ్చాంకదా! మీరెందుకు వచ్చేరు?

పశు :- భలేవారే ఇల్లు అద్దెకిచ్చుకున్న వాళ్ళకి హృదయాలు వుండవను కున్నారా? అద్దెడబ్బుల కోసం కాకపోతే ఇంక స్నేహ ధర్మంగా రాకూడదా?

రాజ్యం :- అయితే మీరు స్నేహంకోసం వొచ్చారన్నమాట.

పశు :- ఇందాకట్నించి మీరు బాలమురళీ కృష్ణ గారి పాటకచ్చేరీ గురించి ఆలోచిస్తు న్నారు కదా!

రాజ్యం :- అవునూ. రాజారాంగారు రెండు ఫ్రీపాసులున్నయంటున్నారు.

పశు :- మా వద్ద పాతిక టిక్కట్లున్నాయి. మాస్నేహితులం ఎడ్వాన్స్‌గా తీసుకున్నాము.

రాజ్యం :- (కళ్ళు పెద్దవి చేసి)నిజంగా?

పశు :- నిజం. మీమీదొట్టు!

రాజ్యం :- అబ్బ! కాలేజీ స్టూడెంట్స్‌కి కూడా ఇంత శాస్త్రీయ సంగీతాభిరుచి వుందా?

పశు :- మీరెంత అమాయికులండీ! మా వాళ్ళందరూ ఆ కచ్చేరీ కోసం కొన్నారను కున్నారా? వాళ్ళ వాళ్ళ ఫేవరేట్స్ కోసం

కొన్నారు. అంతా హాలుముందు నించుంటారు. టికట్లు దొరకని అమ్మాయిలకి తమ తమ టిక్కట్లు ఆఫర్ చేస్తారు. అమ్మాయిలు వీళ్ళకి కూడా, తమలాగే సంగీతాభిరుచి వుందని మురిసిపోతారు. హాబీలు కలవకపోతే ఇంత స్నేహాలు పెంపొందటం ఎల్లాగు ?

రాజ్యం :- (నవ్వి) బ్రైట్ ఐడియా ! ఇంతకీ మీరెందుకు కొన్నట్లు?

పశు :- (తన్మయంగా) కొన్ని కొన్ని పనులు మీరెందుకు చేసారు అని అడిగితే చెప్పటం కష్టం. అసంకల్పితంగా చేసేస్తూ వుంటాం. వాళ్ళు కొంటూంటే మేమూ కొనే సాము. అనుకోకుండా మీకు సంగీతాభిరుచి వుందని తెలిసింది. నామనసు మధురమనోజ్ఞ మయిన ఆనంద రాగాలనాల పిస్తోంది.

రాజ్యం :- ఆనందరాగాలు కాదు. ఆనంద భైరవి !

పశు :- ఏదో ఒక రాగం. నాకు పేరు కాదు ముఖ్యం. ఆరాగం యొక్క నడక, మూర్ఛన వగైరా వగైరా !

జోగప్ప :- మీరూ ఏదయినా పాడతారా? ఇన్స్ట్రుమెంటా ఓకలా !

పశు :- నేనా పాడటమా ! నాకా పాటా ! అబ్బే నేను పాడలేను. కాని ఆ రాగలహరిలో మైమరచిపోతాను. నాలో మమతలు పొంగులు వారతాయి. అల్లరిచేసే పిల్లగాలులు మల్లెఘ నాపై చల్లుతుంది. నా కలల కోరికలన్నీవసం తాలనే పూయించుతుంది. నా హృదయం రెక్కలు విప్పి ఆకాశంలో హంసలరీతిగా హాయిగా పయనం సాగించుతుంది.

జోగప్ప :- ఆహా ! ఓహో ఏం మాటలండీ ! అవి మాటలా, అద్భుత పదజాల కర్పూర గుళికలా ! ఏ కవిప్రాసాదో కాని...

పశు :- ఒక కవి వ్రాయటమా ! నాలో ఆవేశం పొంగి పొరలినప్పుడు అకువుగా అల్లాంటి వాక్యాలు మాట్లాడేస్తూవుంటాను.

జోగప్ప :- క్రితం జన్మలో మీరు అద్భుతమయిన కవులో, వాగ్గేయకారులో అయివుంటారు. జన్మాంతర సంస్కారమంటే ఇదే కాబోలు ! ధన్యుడివి నాయినా.

మాణి :- (టీ కప్పులు తెచ్చి చెరొక టీ ఇస్తూ) తీసుకో నాయినా.

అవధాని :- (నడుంకు ఒక తుండుగుడ్డా, భుజం మీద ఒక తుండుగుడ్డా వేసుకుంటాడు. వరే అబ్బాయి ఇక్కడున్నవా? వంటఅయింది) దేవికి నయివేద్యం కూడా పెట్టాను, భోంచేసి ఇస్కూల్‌కి వెళ్ళుదువురా.

రాజ్యం :- (నవ్వి) ఇంకా ఇస్కూలేమిటండీ మామయ్యగారూ ? కాలేజీ అనాలి. మీ అబ్బాయిగారు పెద్ద చదువు చదూతున్నారు.

అవ :- (రాజ్యం కేసి కళ్ళుపెద్దవిచేసి చూసి) నువ్వు, నువ్వు ?

మాణి :- మా అమ్మాయే అన్నయ్యగారూ!

అవ: మీ అమ్మాయేనా ? ఇంకా ఎవరో అనుకున్నాను. ఏవూరు ఇచ్చారు.

రాజ్యం : ఈ వూరేనచ్చింది. మా అమ్మ ఇచ్చినా ఇవ్వకపోయినా, నేను ఈ వూళ్ళోనే వుండాలనుకుంటున్నాను.

అవ :- సిరిగల పిల్లవి, నీకు అద్దేముంటుంది తల్లి. మహాలక్ష్మిలా వున్నావు. ఏ ఇంటికి వెడతావో కానీ.

మాణి - ఏమిటో అన్నయ్యగారూ మాకూ ఇరస్తా పరస్తా ఎవ్వరూ లేరు. మా పల్లెలో అంతే ఇరుగూ పొరుగూ, బంధువులకంటే ఎక్కువగా ఆదరణా ఆప్యాయతా చూపుతారు


నూతనసంవత్సర శుభాకాంక్షలతో

Phones : Office : 25
Resi : 25 A

అన్నిరకముల పురుగుల మందులు నమ్మకమైనవి,
నాణ్యమైనవి, సరసమైన రేట్లకు లభించుచోటు !

# కంచర్ల రామలింగేశ్వరరావు సన్స్

హోల్‌సేల్ షుగర్ డీలర్స్ & జనరల్ మర్చెంట్స్

కైకలూరు (కృష్ణా జిల్లా)

సక్రమ పద్ధతుల్లో సాగు—సకాలంలో సస్యరక్షణ
అధికోత్పత్తికి అత్యావశ్యకం !

ప్రొప్రయిటర్ : కె. బి. ఎన్. వి. సత్యనారాయణ

డిస్ట్రిబ్యూటర్స్ : కె. సి. పి. ఆంధ్రా సిమెంట్స్, పావాలిస్ అండ్ కం. లిమిటెడ్.,
ఇ. ఐ. డి. ప్యారీ లిమిటెడ్, ఎ. సి. సి. లిమిటెడ్, ఫెర్టిలైజర్స్, అండ్ పెస్టిసైడ్స్,
కె. సి. పి. షుగర్స్, హైదరాబాద్ ఆస్బెస్టాస్ సిమెంట్‌షీట్స్, పైప్స్

ఇది మహానగరమాయే. పూకా, మగదిక్కు లేదాయె ఆ మేడకొస్తా, అమ్మకం అయిపోతే ఇక ఈ పిల్లని దానింటికి దానిని పంపేసి చేతులు దులుపుకు కూర్చుంటాను. అన్నయ్యగారూ నేను మీ చెల్లెల్నె అనుకోండి. ఆమేడ అమ్మకం మాట మీ చెవిని వేసాను. కాస్త శ్రద్ధ చూపెట్టుదురూ బాబూ.

అవ :- మీరేం బాధపడకండి నేనువున్నానుగా. మీరు నిర్భయంగా గుండెలమీదచేతులు వేసుకుని నిద్రపోవచ్చును.

జోగప్ప :- మీరు కంగారుపడకండి. నేనూ వాకబు చేస్తాను. సంగీతం కాలేజీకి స్వంత భవనము కావాలను కుంటున్నారుట. అయిదారువేలు వారాల్లో మీమేడ చెల్లుబాటు చేసేస్తే మంచిది.


అవ :- లక్ష పై మాట వస్తుంది నేను పూనుకుంటే. అమ్మా మీ భవంతి నేను ఎరుగుదును. పాతకాలందయినా చాలా దృఢంగా వుంటుంది. ఎక్కడా వాస్తుదోషం లేదు. చాలా గట్టిపునాది మీద వేసిన మేడ. నడిబజారులో వుంది. అమ్మా బండసున్నతో ప్రారంభించిన సంసారం నాది. నేటికిలా ఇల్లువాకిలితో నిలబడ్డాను. లక్ష్మి ఏదారిన నడిచివొస్తుందో ఎవరికి తెలుసు. వరే అబ్బాయి ఎటూకానివేళ కాఫీ పుచ్చుకున్నావా ? ఇంక అన్నమేం సయించుతుంది. పద భోజనానికి (పశుపతి అవధాని లేస్తూంటే తెరవ్రాలుతుంది.)

## శివ రంగం

(రాజ్యలక్ష్మి వాటా) [తెరఎత్తేసరికి రాజ్యలక్ష్మి ఏదో కూనిరాగం తీస్తూ సోఫాలో కూర్చుని వుంటుంది. ఆకర్షణీయంగా అలంకరించుకుని వుంటుంది. మాణిక్యాంబ పూల దండతెచ్చి కూతురు తలలో పెడుతూంది]

మాణి :- నాకంతా అయోమయంగావుందే అమ్మాయీ ఈ మేడ అమ్మకంలోమన్నిబోల్తా కొట్టించేస్తాడేమో ఈ అవధాన్లు సుఖాన్‌గాడు ఈ విషయం పట్టించుకోడు. రాజారాంకి ఇల్లాంటి విషయాల్లో అట్టే అనుభవం ఉన్నట్లు తోచదు.

రాజ్యం :- పోన్లేవే అనవసరంగా నువ్వు బెంగపెట్టుకోకు. మనం కట్టించినమేడాఏమిటి ఇంత నష్టం వచ్చింది, అంతనష్టం వచ్చింది. అని బాధపడటానికి తాతల నాటి వారసత్వం మేడ. మనం అమ్మకపోతే ఏ గాలివానకో కూలి పూరుకుంటుంది. క్యాష్‌చేసుకుని బ్యాంకులో పడేసుకుంటే ఆ వడ్డీ డబ్బుతో జీవితాంతం సుఖంగా బ్రతకొచ్చును. ఆ మేడ బాగు చేయించటం మన వల్ల కాదు.



"వింతయిల్లు—సంతగోల" చిత్రంలో ప్రభ, శరత్‌బాబు

మాణి :-ఏమిటో ఆడకూతుళ్ళం.ఇలాంటి లావాదేవీలు మనమేంచేయగలం. హఠాత్తుగా కన్నుమూసాడా మహారాజు ఆడదానిచేతఅర్ధం మగవాని చేత బిడ్డా అన్నారు. ఎల్లా నిర్వాకం మగవాడి చేత బిడ్డా అన్నారు. ఎల్లా నిర్వాకం చేసుకుంటామో ఏమిటో.

రాజ్యం :- అమ్మా బాధపడకు డబ్బులేకపోతేనే స్త్రీలు బ్రతకలేరు. కానీ డబ్బుండీ మనకు బెంగ ఎందుకు ?

మాణి :- డబ్బువున్నాలేక పోయినా మగవాడి అండలేని స్త్రీలు అందరికీ చులకన అవుతారు తల్లీ.

రాజ్యం :- మగవాడిలో స్త్రీలకి తనేరక్షణ కల్పించాలనే భావం. బలంగావున్నవాళ్ళు. ఏ స్త్రీ తనని తాను రక్షించుకో నక్కర్లేదు

మాణి :- ఏమో అభంశుభం తెలియని దానివి. ఇన్నాళ్లూ ఏ బాధ్యతా లేకుండా తూరీగలా తిరిగే దానివి.

రాజారాం :- ఏమిటి అంతదీర్ఘాలోచనలో వున్నారు ? (అంటూవస్తాడు)

రాజ్యం :- రండి రండి ! మీగురించే అనుకుంటున్నాము.

రాజా : నా గురించా ! ఏమిటద్బా ?అంత ఆలోచన.

రాజ్యం :- మీరు నిగర్వి అంతపెద్దఉద్యోగం చేసుకుంటూన్నా చిన్న పిల్లల్లా అందరితోనూ కలసిపోతారు అంటోంది అమ్మ.

రాజా :- (గర్వంగా నవ్వి) అది మీ సహృదయత నేను ఎవరితోనయినా అల్లాగే కలిసిపోతాను. అందులో మీలా వంటరిగా వున్న వాళ్ళంటే నాకు మరీ అభిమానంగా వుంటుంది. ఏమంటే వంటరి తనంలోవున్న ఆవేదన నేను వంటరిగా వున్నానుకనుక నాకేం అర్థం అవుతుంది మరి.

మాణి : నీకు బంధువులెవరూ లేరాబాబూ

రాజా : ఎందుకు లేరు నలుగురు అన్నలున్నారు, వాళ్ళకు భార్యపిల్లలున్నారు. పిత్రార్జితమయిన ఆస్తి అంతా వాళ్ళ విలాసాలకి భార్యల పురుళ్ళకీ, వాళ్ళ వాళ్ళ పిల్లల పెళ్ళిళ్ళకీ అయిపోయింది. ఆఖరు వాడ్నినేను నాకు రెక్కలే మిగిలాయి— మా నాన్న అమ్మ బోలెడు ఆస్తిపాస్తులు ఇచ్చిపోయినా ఆ ఆస్తి అంతా మా వదినెలు తెచ్చిన పుట్టింటి వస్తువులు పరావర్తనం చెందాయి. అయిదుగురు మగపిల్లలున్న మా సంసారంలో ఏది చూసినా చివరికి గిన్నె చెంబు కూడా మూడోవదిన మేనమామ ఇచ్చినదో, పెద్దవదిన సరదాపడికొనుక్కున్నదో. నాలుగోవదిన మేనత్తతోటికోడలు ఆడపడుచు మొగుడిచ్చినదో అయివుండేది. ఇంక స్థిరాస్తి విషయం. పెద్దఇల్లువుండేది— ఒకగది పడిపోతే ఇంకోగదిలోకి మకాం మారుస్తూ మొత్తం ఇల్లంతా పడిపోయేదాకా ఆ ఇంట్లో ఉండి తర్వాత ఎవరికి వాళ్ళు వేరే వేరే ఇళ్ళల్లో అద్దెలకి వెళ్ళిపోయేరు. శిథిలాలతో నిండిన ఇంటి స్థలాన్ని అయిన కాడి

అమ్మేసుకుని నలుగురు ఏవేవో అప్పులున్నాయని తలొక అయిదారువందలు తీసేసుకున్నారు. అల్లాంటి సోదరులు వున్నారని చెప్పుకోవటం వరకే కాని వాళ్ళనించినాకు ఎల్లాంటి ఆత్మీయతా లభించదు.

మాణి :- బంధువులందరూ అంతే బాబూ ఎవళ్ళస్వార్థం వాళ్ళది. నీతో పరిచయంనాకు అన్నదమ్ములు లేని లోటు తీర్చుతుంది-

రాజా :- ఈ రోజుల్లో స్నేహానికున్న విలువ బంధుత్వాలకి వుండటంలేదు—స్వార్థానికి తావుండదు— నిష్కల్మషమయిన స్నేహంలో. అన్నట్లు మర్చిపోయాను మాకంపెనీ వాళ్ళు ఇంకో బ్రాంచికి ఇల్లుకావాలన్నారు. మీ మేడ విషయం చెప్పాను. ఒకటి రెండ్రోజుల్లో ఈ విషయం కమిటీ మీటింగ్‌లో ఫైనలైజ్ చేయొచ్చును. ఎనభయ్ అయిదువేలదాకా ఇవ్వగలందులకు అవకాశంవుంది.

మాణి :— చల్లని మాట చెప్పావు ఉండు కాఫీ తెస్తాను.

(లోపలికి వెళ్తుంది.)

రాజా :— రాజ్యం ఇదంతా ఎందుకు చేసానంటావ్ ?

రాజ్యం :- మీ మంచితనం. మనం ఒకళ్ళనొకళ్ళం చూసుకున్న వేళా విశేషం మీకు మాకు సాయపడాలనే బుద్ధిపుట్టింది. దేముడు మనుష్యుల్లో కాస్తఅయినా మిగిలించకుండా మంచితనమంతా తనే తీసుకుంటాడా ఏమిటి?

రాజా :— (గాఢంగా నిట్టూర్చి) రాజ్యం ! నీకు ఎల్లా చెప్పాలో అర్థంకావటం లేదు. నీ మనస్సుని ఆకర్షించటానికి నాకు సంగీతం కానీరాదు, నీకా మగవాడి మాటలకీ చేతలకీ అర్థాలు వెతకటం రాదు. నా బాధ నీకెలా అర్థం అవుతుంది.

రాజ్యం :- ఏమిటో మీరు మరీచిన్నబుచ్చుకున్నారు. మా వల్ల ఏమన్న పొరపాటు జరిగిందా ?

రాజా :- పొరబాట్లు చేయలేని పిల్లవు కనుకనే నీ గురించి నా కింత ఆలోచనగా వుంది రాజ్యం. సువ్వీకాలములో పుట్టాల్సిన ఆడపిల్లవుకావు-

రాజ్యం :- (బెంగగా ముఖం పెట్టి) ఏమండీ మేమేదైన ప్రమాదంలో ఇరుక్కోబోతున్నామా ?

రాజా :- అమాయకమయిన ఆడవాళ్ళకి అందం, అర్థం. అనేక విధములయిన ప్రమాదాలని తెచ్చిపెడ్తాయి రాజ్యం.

రాజ్యం :— (భయంగా కళ్ళు పెద్దవిచేసి) వివరంగా చెప్పండి రాజా.

రాజారాం :— అవధానిగారికి ఆ అస్తిమీద నీ మీద ఒకకన్ను వుంది—మీ అమ్మగారితో ఎల్లానో బులిబుచ్చికం మాటలాడి నిన్ను పశుగాడికి కట్టేసి మీ ఆస్తిఅంతా తమపరం చేసేసుకోవాలనే ఉబలాటపడుతున్నాడు. అందుకనే నాకు పోటీగా ఇంకోబేరంతెచ్చాడుమేడకి-తొంభయ్‌వేలు ఇప్పిస్తానని ఇందాక పెరట్లో మీ అమ్మతో కోస్తున్నాడు-

రాజ్యం : పశూకి అప్పుడే పెళ్ళెందుకు ఇంకా బి. ఎ అయినా ప్యాసుఅవలేదుకదా !

రాజా :- పిచ్చిరాజ్యం వాడికిపెళ్ళిఅయితే కాని చదువవంటబట్టదు- బి- ఎ. ప్యాసు అయితేకాని, ఎవరూ పెళ్ళికిరారు. అందుకనే అవధానిగాడి తాపత్రయం, అవధానిగాడిపళ్ళూడిన సింహంలాంటివాడు దవడలతోనే ఎములని పటపట లాడించేస్తాడు-

రాజ్యం : పెళ్ళి అయితే పెళ్ళాం కోసం చదువుతాడంటారా పశూ !

రాజా :— వాడిబొందా! వాడికి పెళ్ళియావ, వాడినాన్నకి డబ్బుయావ.


Phone : 81
Resi : 81 A

**Tatavarty Venkata Narasimha Rao**

**MANURES & GENERAL MERCHANT**

*Dealers In :*

Vijay, Parry, Coromandel, Mysore & A. C. C.
Fertilisers & Pesticides

**KAIKALUR** Krishna Dt. (A. P.)

తటవర్తి వెంకట నరసింహారావు

మెన్యూర్స్ అండ్ జనరల్ మర్చంట్

కైకలూరు [కృష్ణా జిల్లా]

సుభాన్ :- (ఫుల్‌సూటులో వుంటాడు) డియర్ రాజ్ ఏం చేస్తున్నావ్ ! రెడీగా వున్నట్లున్నావే !

రాజ్యం :- ఏమిటి బావా హడావిడి !

రాజా :- (ముఖం చిట్లించుకుంటాడు.)

సుభాన్ :- ఓహ్. రాజారాం ! మీరూ ఇక్కడ్నే వున్నారా.

రాజ్యం :- ఇంతకీ ఏమిటీ సుడిగాలిలా వచ్చేవు?

సుభాన్ :- మా డ్రమేటిక్ ఎసోసియేషన్ వాళ్ళు స్వంతంగా ఒక బిల్డింగు కావాలనే ఆలోచనలో వున్నారు. నేను మన మేడ గురించి చెప్పాను. కొద్దిగా మార్పులు చేసుకుంటే క్రింది హాలుని ఫైన్ ఆడిటోరియంగా కూడా మార్చవచ్చును. మేడ మీద మా కార్యదర్శి డిస్ట్రిబ్యూటింగ్ కంపెనీ పెట్టుకుంటానంటు న్నాడు. రెండు మూడు పిక్చర్లు బుక్ చేసాడుట. ఒకసారి నువ్వుకూడా రాకూడదా ! వాళ్ళు మేడ చూస్తానంటున్నారు.

రాజా :- (వ్యంగ్యంగా) ఇంతకీ ఎంత డబ్బు పెట్టగల రంటారు ! పాతికవేలా, ముప్ఫయ్‌వేలా !

సుభాన్ :- అబ్బె ! అంత ఖరీదు చేయదు. ఆమేడ రిజిస్ట్రేషన్ ఖర్చులు వాళ్ళు పెట్టు కుని లక్ష రూపాయలూ వీళ్ళకి ఇచ్చేట్లు చూడగలను. లక్షపాతిక వేలు పెట్టే మాటుంటే ఇంకో ఇద్దరు ముగ్గురు పార్ట్నర్స్‌ని చూసు కుని పిక్చరే తీయొచ్చును.

రాజ్యం :- ఒక లక్ష వుంటే పిక్చరు తీయొచ్చు నంటావా బావా ?

రాజా :- పిక్చరు. ప్రారంభోత్సవానికి మొదటి షాటుకే సరిపోతుంది.

రాజ్యం :- మంచి హీరోయిను వుంటే డిస్ట్రిబ్యూటర్స్ డబ్బు ఇస్తారుట కదా.

సుభాన్ :- ఏమిటి రాజ్యం ! నీకు సినిమా తీద్దామనుందా ! వేద్దామనుందా ?

రాజ్యం :- (గారంగా) బావా ! నేను సిని మాలకు పనికివస్తానా ?

సుభాన్ :- (బిసైపోయినట్లు) నువ్వు వేషం వేస్తానంటే ఇప్పుడున్న నాయికలంతా బలాదూరు అయిపోరూ ? నీపర్సనాలిటీ. ఛార్మింగ్ ఫేస్. హార్ట్‌విన్నింగ్ స్మయిల్. డింపుల్స్ ఇన్ ది చీక్స్. ఓ మై గాడ్ ! నిన్ను సృష్టించిన బ్రహ్మ నీఎదురుగా నించుండి నిన్ను చూసాడంటే నిన్ను మాకు దక్కనిసాడా ! నిజంగా డియర్ నీకా ఉద్దే శ్యం వుంటే చెప్పు. ఇప్పుడే మద్రాసు పోదాం. (మాణిక్యాంబ రెండు కప్పులతో ప్రవేశిస్తుంది) వాటె వండర్ ! అత్తాజీ ! నేను వచ్చినట్లు మీకెలా తెలిసింది ? అంటూ కాఫీ కప్పులు తీసుకుని ఒక కప్పు రాజారాం కిస్తాడు )

మాణి :- నీమాటలు వంటింట్లోకి విన పడుతున్నాయి లేరా !


రాజ్యం :- అమ్మా ! బావ నన్ను సినిమా హీరో యిన్ను చేస్తాడుట!

మాణి :- నాముఖంలాగే వుంది. ముందు నువ్వు హీరోవి అవు. తర్వాత దాన్ని హీరో యిన్ని చేయొచ్చును.

పశు :- (వస్తూ) ఓహో సభాసదులంతా ఇక్కడ్నే చేరారే ఏమిటి విశేషం ?

రాజ్యం :- కూర్చోండి. ఈయన మాబావ సుభాష్ చంద్ర ! రాజారాంగారి ఆఫీసులోనే ఈయనకి ఉద్యోగం !

సుభాన్ :- అవమానం. అవమానం. అయ్యా ! తమరెవరోకాని. తమరెవరయినా కాని మీరు కాబోయే ప్రఖ్యాత చలనచిత్ర హీరోని చూస్తున్నారు.




రాజ్యం :- ప్రఖ్యాత చలనచిత్రహీరోగారు సుభాన్, తెరపేరు.

పశు :- ఓహో ! ఏమి సుదినం ! అర్యా సుభాన్ గారూ ! నాకెన్ని రోజులనుండియో, ఒక హీరోతో మాట్లాడాలని కోరికగా వుంది అది ఈనాటికి తీరింది. మిమ్మల్ని చూసిన నా మది ఎంతో పులకించుచున్నది. అదియే నాలో కలుగు పరవశత్వమునకు నాందీ వాచకము !

సుభాన్ :- డియర్ ! ఈయన సంస్కృతం మాట్లాడుతాడా !

రాజారాం :- అది సంస్కృతం కాదు. అచ్చగా మన మాతృభాష ! పదహారణాల పసిడి తెలుగు !

అవ :- (తువ్వాలు దులుపుకుంటూ) అవును కానీ ఇందాకట్నించీ వింటున్నాను. పెళ్ళి కాని పిల్లని పట్టుకుని డియర్ • డియర్. అంటూ ఏమిటా పిలుపు ? నావళ్లు మండుకు వస్తోంది.

సుభాన్ :- వాటె వండర్ ! ఇన్నాళ్లు పెళ్ళికాని అమ్మాయిలనే డియర్ అనొచ్చ నుకున్నాను. పెళ్ళిఅయిన ఇల్లాళ్ళని కూడా డియర్ అనొచ్చనుమాట నా కిన్నాళ్ళు తెలీనే తెలీదు పిలకావధాన్లుగారూ !

పశు :- నాన్నగారూ ! వారెవరనుకున్నారు! ప్రఖ్యాత చలచిత్ర హీరోగారు.

అవ :- హీరో వో, జీరోవో, ఎవరయి తేనేం? నాకేంరా? అయినింటి ఆడపిల్ల, వయ సులో వున్న ఆడపిల్ల నాలుగు సంసారాల మధ్యా, అన్నమైన వాళ్ళందర్నీ చేర్చి ఇక ఇక లూ పక పకలూ ఆడుతూ కూర్చుంటే మాలాంటి సంసార్లకి బాగుండదు మరి !

పశు :- ఏమిటి నాన్నగారూ! మీచాద స్తపు మాటలు మాట్లాడకండి! ఇల్లారండి. (అంటూ తండ్రిని స్టేజి చివరికి తీసుకు వచ్చి ప్రేక్షకు లకు వినపడేలా) ఇప్పట్నించీఇల్లాకోడం త్రి కంపెడితే రాజ్యం, నన్నుమూడుముళ్ళూ వేయ నిస్తుందా? మూడుముళ్ళూ వేయనిచ్చేదాకా స్వేచ్ఛా విహంగానికి రెక్కలుండనియ్యాలి ! మీకేం తెలిసి ఛావదు ! (అంటూ విసు క్కుంటూ ముఖం చిట్లించుకుంటాడు )

రాజ్యం :- ఎమిటండీ. వెళ్ళి పోతు న్నారేం ?

పశుపతి :- ఏంలేదు. మళ్ళీవస్తాను లెండి. (అంటూ తండ్రి రెక్క పుచ్చుకుని నిష్క్ర మిస్తోంటే తెరవ్రాలుతుంది.)

## 4వ. రంగం

(రాజ్యం ఏదో ఆలోచిస్తూ వుంటుంది.)

జోగప్ప :- ఏమదృష్టం ! ఇన్నాళ్ళకి ఒంటిగా కనిపించావు !


రాజ్యం :- మీరా మాష్టారూ !

జోగ :- రాజ్యం.! నీతో ఎన్నిసార్లు మాట్లాడాలని వచ్చినా. నీచుట్టూ వంధిమా గధుల్లా ఎవళ్ళో వకళ్ళు వుంటూనే వుంటారు. రాజ్యం! నువ్వు మామూలు ఆడపిల్లవు కావు! అపరంజి బొమ్మవు ! శాంతమూ సౌజన్యమూ మూ ర్తీభవించిన దేవతామూ ర్తివి ! కోకిల గానములోని తీపి నీగొంతులో వుంది. సరస్వతి నీ నాలుక మీద న ర్తనమాడుతుంది.

రాజ్యం :- (అమాయకంగా) ఏమిటి మాష్టారూ ! మీరివ్వాళ అదోకలా వున్నారు!

జోగప్ప :- ఏం లేదు రాజ్యం ! నేను నీ మేడ అమ్మకం గురించి చాలా తిరిగాను.

నా వద్ద సంగీతం నేర్చుకునే వాళ్ళనందర్నీ అడిగాను. చివరికి నా కోరిక ఫలించింది. గాన కళాశాల వాళ్ళు మీభవనాన్ని కొనటానికి అంగీకరించారు. తొంభయ్‌వేల దాకా ఇస్తాను. నేను ఎల్లాను అందులో వీణ చెప్పటానికి కుదురుకున్నాను. చాలా విరాళాలు వొచ్చేయి. రాజ్యం ! నీ వీణాగానం ఎల్లవేళలా నాహృద




యాన్ని స్పర్శించేలా చేయదల్చుకున్నాను. నీ సంగీతారాధన మానకు రాజ్యం!

రాజ్యం :- ఎంత అభిమానమండీ మాష్టారూ! మీ దీక్ష మీ ఏకాగ్రత మీకు సంగీత ప్రపంచములో ఎనలేని కీర్తి ప్రతిష్ఠలని తెస్తాయి మాష్టారూ! నా పూర్వ జన్మ సుకృతం కొద్ది స్వల్ప కాలమయినా మీ వద్ద వీణ నేర్చుకునే అదృష్టం కల్గింది. నా జన్మ సార్థకత నొందింది.

జోగప్ప :- రాజ్యం! నీ రాగం నీ తాళం. నీ భావం. అంతా నా గురించే అన్నీ నా గురించే అన్న భావంలోనే సజీవంగా వుంది. నేను ఏ అమ్మాయికి సంగీతం నేర్పుతున్నా ఆ అమ్మాయి నాకు నీలాగే కన్పించుతోంది. నువ్వు నాకు పలానా దానివిగా కన్పించటం లేదు. నాకు మనస్సులో మనస్సుగా వుంటున్నావు. రాజ్యం! నీవు నా హృదయ రాజ్యలక్ష్మివి! నిన్ను నా కళ్ళల్లో పెట్టి కాపాడుకుంటాను.

రాజ్యం :- (నవ్వుతూ) భలేవారే మాష్టారూ! నేనేమన్నా కాటుకనా కళ్ళల్లో పెట్టుకుందుకు?

సుభాన్ :- బాగా చెప్పావు డియర్ - మాష్టారూ. మీరేం కాపాడుకో అక్కర్లేదు. ఎంతమంది విలన్ల చేతుల్లోంచి అయినా ఎల్లాంటి ఆర్థిక దుస్థితిలోంచయినా, హీరో యిన్ని కాపాడుకొనటం హీరో హక్కు. ఆ హక్కుకి భంగం కలిగించే హక్కు మా సినీ ప్రపంచములో ఎవ్వరికి, ఆఖరికి ఫిల్మ్ ప్రొడ్యూసర్‌కి కూడా వుండదు. రాజ్యం. డోంట్ ఫియర్. నీమీద ఎల్లాంటి విలన్లూ చెయ్యి వెయ్యకుండా నేను నీకు సంపూర్ణ రక్షణ ఇయ్యగలను. నన్ను నమ్ము.

రాజా :- (హడావిడిగా వస్తూ) రక్షణ ఇస్తాడయ్యా పెద్ద జీతగాడు. తాదూరకంత లేదు. మెడకు డోలనీ! నీ నాటకాల వేషాలు. నీ టీలకి సిగరెట్లకీ ఆర్జించి పెట్టుతున్నాయా! నీ హీరో వేషాలు శ్రీరామనవమి. వినాయక చవితి పందిళ్ళ నాటకాలలోనే కదా. పెద్ద సినీ హీరో అయినట్లు పోజులు పెట్టున్నాడు. పోజులు-

రాజ్యం :- ఏమిటి రాజారాం గారూ హడావిడిగా వున్నట్లున్నారు. కూర్చోండి కూర్చో బావా! (సుభాన్ రాజారాం ఎదురెదురు సోఫాల్లో కూర్చుంటారు. జోగప్ప, నిట్టూర్చి సోఫాలో వెనక్కు జారబడి కళ్ళు మూసుకుంటాడు.)

రాజా :- అది కాదు రాజ్యం. అందమయిన దానవు. ఆస్తికలదానవి. నువ్వు ప్రతీ అడుగూ తూచి వెయ్యాలి. నీ భవిష్యత్తు యొక్క భద్రత నీ చేతిలోనే వుంది. నీవు జాగ్రత్తగా ఆలోచించు.

రాజ్యం :- మీరు చెప్పేది నాకర్థం కావటం లేదు.

రాజా :- శ్రద్ధగా విను! ఈ కూని రాగాల కూనయ్యనీ, నత్త నాటకాల నానయ్య వీనమ్మా వంటే నీ ఇల్లూ వళ్ళూ గుల్ల చేస్తారు. నసీ ఆస్తి పెట్టుబడి. వీడో హీరో అవ్వాలనీ, వీడు ఒక పెద్ద విద్వాంసుడు అయిపోయి ఘన సన్మానాలందుకోవాలనీ వలలు పన్నుతున్నారు. నేను ఉద్యోగస్థుడ్ని! నీ ఆస్తిమీద మోజులేదు. నన్ను నేను కాక, నిన్ను కూడా పోషించుకో గలను. అత్త పోరు లేదు, ఆడబిడ్డ పోరు లేదు. నాకు ఒక స్టేటస్ వుంది. మీకా మగదక్షత లేదు. మీ ఆస్తిని మీ చేతుల్లోనే వుంచుతాను. దానికి గార్డియన్‌గా మాత్రమే వుంటాను ...

అవ :- (పిలక ముడి విప్పి జుట్టు విప్పుకుంటూ ప్రవేశిస్తాడు.)

ఏమిటర్రోయ్! వాళ్ళకేదో దిక్కూ మొక్కూ లేనట్లు మీరంతా సభలు తీర్చిచెప్పుతున్నారు- మాణిక్యమ్మ తల్లిని చూడగానే నేను తోడ బుట్టువుగానే భావించాను, ఈ ఇంటి ఆడపడుచు ఆమె. పెదముండా కొడుకుని నాపంచన వున్నారు. వాళ్ళ ఆలనా పాలనా నేనే చూసుకుంటాను. ఎల్లాంటి పీటముడి వ్యవహారమయినా పిలక ఝాడించినట్లు ఝాడించి పారేస్తాను. ఏమిటనుకున్నారో! నా గడపలో వున్నన్ని రోజులూ ఆవిడ నా చెల్లెలు, ఆ పిల్ల నా కోడలు! (మాణిక్యాంబ ప్రవేశిస్తుంది.) ఏమంటావమ్మా!

మాణి :- (దిగులుగా) పెద్దవారు! మీ కన్నా నాకు ఎక్కువ ఏం తెలుసునండీ

రాజ్యం :- (నవ్వుతూ) మామయ్యగారు! మీ ధర్మమా అని నేటితో నాకు వచ్చిన సందేహం తీరిపోయింది.

పశు :- (ప్రవేశిస్తూ) ఆఁ హాఁ; ఏమా చిరునవ్వులు వెదజల్లే చిన్నారి మోము సోయగము? జలారు మేలి ముసుగులోని నీలి నెలవంకలా ఓహో చెలీ! జాబిలీ!

అవ :- వచ్చావూ అప్పుడే! అల్లా కూర్చో! ఇంతకీ నీ తీరిన సందేహం ఏమిటమ్మా అమ్మడూ!

రాజ్యం :- పూర్వము రాజకుమార్తెలు స్వయంవరం, చాటించి తమకు నచ్చిన వరులని తామే ఏరుకునేవారు ఈ రోజుల్లో అల్లాంటి అవకాశం లేదు అనేవారు. మా నాన్నగారు ఆస్తి అంతస్తువున్న నాకు అల్లాంటి అవకాశం ఎందుకు రాదు అనేదాన్ని. ఈ రోజు నాకెంతో సంతోషం కలుగుతోంది. నేను స్వయంవరం చాటక పోయినా నాకోసం ఈ నలుగురూ ఎంతో తహతహలాడుతూ తమలో తామే ఒకళ్ళకంటె ఒకళ్ళు అధికమని భావించుతున్నారు. నిజంగా నేను పూర్వ జన్మలో సీతనో దమయంతినో సంయుక్తనో అయి వుంటానా అన్పించుతోంది.

పశు :- తప్పక పూర్వ జన్మలో నువ్వొక అందాల రాజకుమార్తెవే అయివుంటావు దేవీ!

మాణిక్యాంబ :- మీమాటలకేం బాబూ! డబ్బులేనివాడు ఓడ ముందు ఎక్కినాడుట. అల్లా చేతిలో డబ్బు లేకుండా పిల్లకు పెళ్ళి మాట లెందుకులెండి.

అవ :- డబ్బుకేం లోటమ్మా మనకి. ఈ ఈఇంటి మీద నెలకు నాలుగు వందలు అద్దె వస్తోంది. డాబా మీద రెండుగదులు పడే సానంటె ఇంకో నూట యాభయ్ వస్తాయి.

సుఖాన్ :- మన మేడ మా ఫిలిం కంపెనీ వాళ్లు కొంటామన్నా రత్తయ్యా.

జోగప్ప:- మా సంగీత కళాశాల వాళ్ళు కొంటామన్నారు రాజ్యం.

రాజారాం :- మా కంపెనీవాళ్ళు కొంటా మన్నారు.

పశు :- అమ్ముకోవటం ఎందుకు రాజ్యం. మనిద్దరం కలిసి ఒక ట్యుటోరియల్ కాలేజీ తెరవవచ్చును. అందులో, ఏమంటావ్?

మాణి :- అన్నగారూ, వీళ్ళందరూతలొక బేరం తెచ్చారు. మీరు అందులో ఏదిమంచిదని తోస్తే ఆబేరం సెటిల్ చేయండి. మీరు అను భవజ్ఞులు. ఇది మీ కోడలు ఆస్తి. కాస్త నాలుగు డబ్బులు రాలేట్లు చేయండి. ఈవ్యవ హారం మీచేతుల్లో పెట్టున్నాడు.

అవధాని :- (పిలక ముడి వేసుకుంటూ) ఎంతమాట, చెల్లెమ్మా. నాకు పశు ఒక కన్ను. రాజ్యం ఒక కన్నూనూ. జాగ్రత్తగా వ్యవ హారం పైసల్ చేస్తాను. పదండి. మీమీ బేర గాళ్ళని నాతో ఒకసారి మాట్లాడమని చెప్పండి. (అందరూ నిష్క్రమిస్తుండగా తెర వ్రాలు తుంది.)

## 5వ రంగం

(రాజ్యలక్ష్మి బాగా ముస్తాబయి వుంటుంది. అవధానితో సహా అందరూ కూర్చొనివుంటారు. మాణిక్యాంబ ట్రేలో అందరికీ 'టీ' కప్పులు తెచ్చి ఇస్తూ వుంటుంది.)

రాజ్యం :- ఏమిటో ఈ రెండు నెలలబట్టి అందరం కలిసి మెలిసి వున్నాం. మీ అందరి సహాయ సహకారాల వల్ల మేము మా మేడని అనుకున్న దానికన్నా ఎక్కువ ధరకే అమ్మ గలిగాము. లేకపోతే ఈ మహా నగరంలో మమ్మల్ని ఆడవాళ్ళని చేసి తేలిగ్గా బోల్తా కొట్టిం చేద్దురు.

మాణిక్యాంబ :- ఈ రాత్రి మీరంతా ఇక్కడ్నే భోజనాలు చేయాలి.

అంతా ఒక్కసారి :- ఏమిటండి విశేషం?

రాజ్యం :- ఒక శుభవార్త చెప్తాను.

అవధాని :- నేనిందాకే చెప్పాగా తల్లీ. వచ్చే దశమి శుక్రవారం రాత్రి మూడున్నరకి నీజాతకానికీ. మావాడి జాతకానికీ నప్పే ముహూర్తం వుందమ్మీ.

పశు :- నిజంగా నా రాజ్యం. నావెన్నెల నోము పండించుతావా?

సుఖాన్ :- వ్హాట్ డియర్. ఆఫ్టరల్ ఒక విద్యార్థిని నువ్వు?

రాజారాం :- పెళ్ళి మాటే నా శుభవార్త?

రాజ్యం :- ఎందుకంత తొందర. రాత్రికి మనమంతా తిరుపతి వెళ్తున్నాం. అదీ శుభవార్త ముందునే చెప్పబోయేది వినండి

సుఖాన్ :- నా కారు తీసుకువస్తాను లే.

రాజారాం :- అసలు విషయం చెప్పు. రాజ్యం. సడన్‌గా తిరుపతి ప్రయాణం ఎందుకు?

రాజ్యం :- మామేడ వెంటనే అమ్ముడు పోయి మేము సవ్యంగా ఈవూరునించి బయట పడితే కొండ ఎక్కుతానని అమ్మ మొక్కు కుందిట. కాష్ అంతా బాంకులో వేసేసాం. అమ్మ పేర ఎఫ్.డి.ఆర్. క్రింద వేస్తాం. అమ్మ ఇంక పల్లెలో వుంటుంది. అంచేత ఇంక ఇక్కడ మకాం ఎత్తేస్తున్నాము

రాజారాం :- మరి నువ్వో. మానలుగురిలో ఎవర్ని నిర్ణయించుకున్నావు? నిజంగా పశు గాడ్ని చేసుకోవటం లేదుకదా. కొంపతీసి?

రాజ్యం :- క్షమించండి. నాకు పెళ్ళయి రెండేళ్ళయింది. మావారు ఫారిన్‌లో వున్నారు. ఇవ్వాళే ప్లేనులో మద్రాసు వచ్చేరు. నేను ఆయనతో వెళ్ళిపోతాను. పాస్‌పోర్టు అదీ ఆయన రెడీ చేసేసారు. కాస్సేపట్లో ఇక్కడికే వస్తారు.

సుఖాన్ :- ఏమిటీ నీకు పెళ్ళయిందా:

జోగప్ప :- పెళ్ళయినట్లు మాకు చెప్పనే లేదేం?

పశుపతి :- నీవు పరిణీతవా?

రాజా :- మరి కన్యగా ఈవేషమేమిటి.

రాజ్యం :- స్థిరంగా వినండి. నాకు పెళ్ళ యిన ఏడాదే మా నాన్నగారు చనిపోయేరు. ఆయన నన్ను కూడా ఫారెన్ తీసుకుపోవా లనుకున్నారు. ఈ మహానగరంలో తాతలనాటి మేడ వుంది అది అమ్మి ఆడబ్బు మాఅమ్మ గారి పేర బాంకులో వేస్తే అది ఆవిడ జీవ నానికి ఉపయోగపడుతుంది. ఎవర్ని నమ్మాలో ఎవర్ని నమ్మకూడదో మాకు తెలియదు. నేను పెళ్ళికాని అమ్మాయిలా వున్నాను కనుకనే తానసే భ్రమతో చూసేరు. మన వస్తువు అంటే వుండే జాగ్రత్త ఎదుటివాడి వస్తువు అంటే వుంటుందా. మీకందరికీ కూడా నేను పవి త్రంగా దక్కాలనే ఆశ వుంది కనుకనే మీ అందరి మధ్యా నేను నిశ్చలంగా నిలబడు గల్గాను. ఎక్కడో పరాయిదేశంలో వున్నవాడి భార్యనంటె మీరు నన్ను ఇంత ఆపేక్షగా చూడగలరా. అందినమటుకు అనుభవిద్దాం అనే మీ మగకే నేను మీదాన్ని కాగలం. అనే భ్రమ కలిగించాను. నన్ను క్షమించండి. నా కింతకంటె మార్గాంతరం కనిపించలేదు.

రాజారాం :- ఎంత అమాయకురాలిగా కన్పించావు. రాజ్యం. అవును నాగరీక సమా జంలో నటన చాలా అవసరం.

అవ :- ఎంత జిత్తులమారి దానివి. ఇంత మంది మగవాళ్ళని నీ చెప్పు క్రింది తేళ్ళల్లా నొక్కిపెట్టావు. ఏం వంచన నేర్పారీ కాలం ఆడముండలు!

రాజ్యం :- ఏం చేయం. మామయ్యగారూ. చెప్పు క్రింద నొక్కి పెట్టక వదిలేస్తే అప్పుడే కుట్టటానికి రెడీగా వుంటాయి. ఒంటి పూస తేళు.

సుఖాన్ :- నీభర్త నిన్ను తీసుకువెళ్ళక పోతే భయపడకు నేను నిన్ను మద్రాసుకి తీసుకు వెళ్ళటానికి ఎప్పుడూ సిద్ధమే. రాజ్యం.

మాణి :- అంతా అతగాడికీ ఎప్పటి కప్పుడు జాబులు వ్రాస్తోనే వుంది. ఇక్కడి విషయాలన్నీనూ మా రాజ్యం.

(తెరలో హారన్ మ్రోగుతుంది.)

రాజ్యం :- అదుగో మావారు వొచ్చినట్లు న్నారు. మిమ్మలందర్ని పరిచయం చేస్తాను వుండండి. (లోపలికి వెళ్తుంది.)

అవ :- తేళ్ళం ముఖాలు వేసుకుని మన మెందుకు? పదండి పోదాం! ఎంతమందిని వెధవాయిలని చేసానో చూసావా అని మొగు డితో డప్పులు కొడుతుంది. గర్వంగా! పదండి పోదాం.

పశు :- మరి తిరుపతి వెళ్ళొద్దా నాన్న గారూ.

అవ :- నీకు పెళ్ళి అయినాక వెళ్దాంలే పద. పద. (కొడుకు రెక్కపుచ్చుకుని లేవ తీస్తాడు. అందరూ లేచి నించోగా. తెర వ్రాలుతుంది.

